# 'ఉరికంబం నరిచేసిన పాపం'

రచయిత:

ఆర్. శ్రీరామమూర్తి, బి. ఏ.

"చంద్రయ్యస్థితి చెప్పడానికి తగిన పదాలులేవు. చచ్చిపోయిన కుర్రాణ్ణి ఒళ్లో పెట్టుకుని ఉన్న తల్లిచూపు మీరు ఎప్పుడైనా చూచిఉన్నారా? చంద్రయ్యచూపు ఆతల్లి చూపుకు కొంత సన్నిహితంగా వుందని చెప్పవచ్చు. ఇంత కంటె నేను ఏమీ చెప్పలేను."

౧

'దొరా! లేవండి - మీకోసం ఎవరో వచ్చి వున్నారు. ఏదో ముఖ్యమైనవిషయంలో మీతో ఇప్పుడే మాట్లాడాలని ఆమనిషి. అంటున్నాడు'— అని నావద్ద పనిచేస్తూవున్న హెడ్ కానిస్టేబులు అన్నాడు.

మంచి శీతాకాలం. రాత్రి ఒంటిగంట అయింది. నేను అప్పుడు గోదావరిమధ్యంలో క్యాంపువేసి వున్నాను. మల్లుదొర అనే దొంగ చాలాకాలం నుంచి ఆప్రాంతాల్లో పోలీసులకు దొరక్కుండా తిరుగుతూవున్నాడు.

అచటి సబ్ ఇన్స్పెక్టరు ఎంతప్రయత్నంచేసినా మల్లుదొరఆచోకీ ఏమీదొరకటంలేదు. మల్లుదొర దోపిళ్ళవల్ల బాధపడేది అచటి గ్రామస్థులే అయినా వాళ్లు ఎవళ్లుకాని అతని ఆచోకీ ఇమ్మంటే ఇవ్వరు.

నేను క్యాంపువేసి సంగతిసందర్భాలు విచారించినమీదట అచటి గ్రామస్థులు అతన్నిగూర్చి ఆచోకీ ఇవ్వకపోవడానికి రెండు కారణాలు కనిపించాయి. అచుట్టుపట్ల మల్లుదొరపేరు చెపితే అందరికీ సింహస్వప్నం. మరిన్నీ అతడు దోపిళ్లుచేసి అధనాన్ని పేదవాళ్ళకు ఇచ్చేవాడు. దోపిడిదొంగలంతా ధైర్యస్థులే అని ఒప్పుకోవలసిందే. వాళ్ళధైర్యం అంతా చావుకు భయపడక పోవడంలోనే వుంది. కాని వాళ్లు ధనందాచినస్థలాలు కనుక్కోడానికిగాను స్త్రీలని, శిశువుల్ని బాధించడానికి ఏమీ సంకోచించరు.

మల్లుదొరదగ్గర ఇల్లాంటి దారుణాలు ఏమీలేవు. దోపిళ్లలో అతను ఒక స్త్రీకేనా హానిచేయలేదు; ఒక్కప్రాణినేనా చంపలేదు. అతడు మొదట్లో ఒక హత్యచేశాడు. ఆహత్యవల్లనే అతను దోపిడిదొంగగా మారేడు. ఈకారణాలన్నిటివల్లా ఆ ప్రాంతాల్లో మల్లుదొరఅంటే భయంవున్నా అభిమానం కూడావుంది. ఇల్లాంటివాణ్ణి పట్టుకోడానికని నేను అక్కడ క్యాంపువేశాను.

౨

హెడ్ కానిస్టేబులుతో ఆమనిషిని నాదగ్గరకు తీసుకురమ్మన్నాను. వచ్చినమనిషి బాగా పొడుగ్గా ఎర్రగా వున్నాడు.

అతనికి పాతికసంవత్సరాలు వుండవచ్చు. కట్టిన బట్టలుమాత్రం బాగా మాసిపోయివున్నాయి.

అతను నాకు దణ్ణమేనా పెట్టలేదు. నాతో రహస్యంగా మాట్లాడాలని చెప్పేడు. నేను హెడ్ కానిస్టేబులుకేసి చూశాను. అతను ఆమనిషి శరీరంఅంతా తడివిచూశాడు. రివాల్వరు, కత్తి వెంట

లైన ఆయుధాలేమీ అతనివద్దలేవు. అప్పుడు హెడ్ కానిస్టేబుల్ అవతలికి వెళ్ళిపోయాడు.

వచ్చినమనిషి. ఏదో చెప్పరానియనోవేదన పడుతూన్నట్లు కనిపించింది. 'మీరు మల్లుదొరకోసం వెతుకుతున్నారు. అతణ్ణి పట్టిఇచ్చినవాళ్ళకి ఇస్తామని మీ డిపార్టుమెంటువారు ప్రకటించిన బహుమానం నేను అతణ్ణి పట్టిఇస్తే నాకు ఇస్తారా?' అన్నాడు.

మల్లుదొరను పట్టిఇచ్చినవాళ్ళకు 500 రూపాయిలు బహుమానం ఇస్తామని ప్రకటించివున్నాము. ఇటీవల సదరు మొత్తాన్ని వెయ్యిరూపాయిలకు హెచ్చించాముకూడాను.

'మల్లుదొర ఉన్నచోటు నువ్వుచూపిస్తే మేము అతణ్ణి పట్టుకుంటాం. బహుమానం నీకే ఇస్తాం' అన్నాను నేను.

'సరే. అయితే.మీరు సిద్ధంగావున్నట్లయితే మల్లుదొరవున్న మకాముకు మిమ్మల్ని తీసుకుపోతాను.మీరు ఇపుడే రావాలి. ఇక్కడికి అది పదిహేనుమైళ్ళ దూరాన్నివుంది. ఎల్లాలేదన్నా అక్కడికి వెళ్ళడానికి నాలుగ్గంటలేనా పడుతుంది.' అన్నాడు అతను.

హెడ్ కానిస్టేబులును పిలిచాను. అతను వెంటనే వచ్చేడు. బహుశా అతను ప్రక్కగదిలోనేవుండి మాసంభాషణ వింటున్నాడుకాబోలు! వెంటనే వెళ్ళి సబ్ఇనస్పెక్టరుని తీసుకురమ్మన్నాను.

ఇనస్పెక్టరు రావడంతోటే జరిగినసంగతి అంతా చెప్పి పావుగంటలో అక్కడికి ప్రయాణంకావడానికి తగిన సరంజామా చేయమన్నాను. నేను దుస్తులువేసుకువచ్చేలోపుగ ఆకొత్తమనిషిని జాగ్రత్తగా చూస్తూవుండమని హెడ్ కానిస్టేబులుకు చెప్పినాను.

3

తగిన ఏర్పాట్లుచేసి సబ్ ఇనస్పెక్టరు తిరిగి నాదగ్గరకు వచ్చేడు.

'మల్లుదొరను పట్టిఇస్తానని మీతో చెప్పినమనిషి ఎవరో కనుక్కున్నారా?' అని అడిగాడు.

'ఆ అతనిపేరు చంద్రయ్య. నివాసం చిట్టిగూడెం.' అన్నాను.

'చంద్రయ్య మల్లుదొరతమ్ముడు' అన్నాడు అతడు.

నేను ఆశ్చర్యచకితుణ్ణి అయాను. ఏమీ మాట్లాడ్డానికి తోచిందికాదు. చివరికి 'నిజమేనా?' అన్నాను.

'మల్లుదొర మొదట్లో ఒకమనిషిని హత్యచేశాడు. అప్పటికేసులో పనిచేసింది నేనే. అప్పటినుంచే మల్లుదొర దోపిడిదొంగల్లోచేరేడు. ఆసందర్భంలో అతని ఇంటిసంగతి, చుట్టాలసంగతి కనుక్కొని నేను రికార్డు తయారుచేశాను. చంద్రయ్య చెప్పిందంతా చూస్తే నాకు ఇందులో యేదో మోసంవున్నట్లు తోస్తుంది. పక్కస్టేషనుకుపంపి మరికొంతమంది పోలీసుల్ని తెప్పిస్తే బాగుంటుందనుకుంటాను. మన దగ్గర ప్రస్తుతం పదిమంది పోలీసువాళ్ళేవున్నారు. మనక్యాంపు చూస్తూవుండడానికి ఇద్దర్నేనా వుంచాలి. మిగిలిన ఎనమండుగురితో అక్కడికి వెళ్ళడం మంచిదా?'

కొత్త పోలీసుల్ని తెప్పించేవరకు వేచివుండడం మంచిదిలా నాకు తోచలేదు. మల్లుదొర చాలా కాలంనుంచి దొరకడంలేదు. ఇప్పుడు ఈ అవకాశాన్ని జారవిడుస్తే అసలే దొరకడేమో! అని అనుమానించేను. ఏమైనాసరే వెళ్ళడానికే ఆర్డరు ఇచ్చేను. చంద్రయ్యవద్ద యేమాత్రం అనుమానం తగిలినా కాల్చివేయుడానికి ఆర్డరు ఇచ్చేను.

మల్లుదొర వున్నాడని చెప్పబడే మకాము తెల్లవారుజామున ఐదున్నరకుచేరాము. శీతాకాలంకాబట్టి ఇంకా చీకటిగానేవుంది. ఊరిచివరవున్న ఒక యిల్లు చూపెట్టి మల్లుదొర కొంతమంది అనుచరులతో అందులో వున్నాడని చంద్రయ్య చెప్పేడు.

ఆ యింట్లోంచి ఎవళ్ళేనా తప్పించుకుపోవడానికి ప్రయత్నిస్తేతప్ప లేకపోతే తెల్లవారేవరకు ఏమీచేయకూడదని చెప్పేను. వ[illegible]ల్ని బాగా గుర్తించడానికి తగిన వెలుగు వచ్చినతోడనే మేము ఆ యింటిదగ్గిరగావెళ్ళి నాలుగుమూలలా కాపు

కాశాము. దొంగలు మేలుకునేవున్నారు కాబోలు! మేము ఇంటికిదగ్గరగా వెళ్ళడానికి ప్రారంభించడంతోటే వాళ్ళల్లో ఒకడు తుపాకిపేల్చేడు.

౪

ఆయింటిని మేము చుట్టు ముట్టేశాము, కాబట్టి అనవసరంగా దొమ్మీలేకుండా పట్టుపడి పోవలసిందని దొంగలికి వినిపించేలాగున కేకవేశాను. నాకేకకి జబాబుగా వాళ్ళు తుపాకులు పేల్చారు. ఒక్కటిగిని స్పష్టంగా ఆరుతుపాకిపేల్పులు వినిపించేయి. కాబట్టి ఇంటిలో ఆరుగురుదొంగలు వున్నారని నిశ్చయించాను. నాతోటిన్నీ, సబ్ ఇనస్పెక్టరుతోటిన్నీ కలిపి మేము పదిమందివున్నాము. సంఖ్యాబలం మాకుంది. కాని దొంగలు సురక్షితంగా ఇంటిలోవున్నారు. వారు మమ్మల్ని సులువుగా గురిచూసి కొట్టవచ్చు. వాళ్ళని ఆయింట్లో బంధించివుంచడంతప్ప తొందరపడి ఏమిచేయడానికిన్నీ వీలు కనిపించదు. ప్రక్క పోలీసుస్టేషన్‌కి పంపి కొత్తపోలీసుల్ని రప్పించడానికి నిశ్చయించాను.

దొంగలు తుపాకులు జోరుగానే కాలుస్తున్నారు. దీన్నిబట్టి వాళ్ళవద్ద తుపాకిమందు బాగా వుందని నేను వూహించాను. చంద్రయ్యను మామేమా నాదగ్గరేవుంచుకున్నాము. గురికి దొరక్కుండా నక్కివుండమని ఆతన్ని హెచ్చరిస్తూనే వచ్చేను. కాని ఎనిమిదిగంటలికి ఒకసారి చంద్రయ్య తెలివితక్కువగా లేచినిలబడ్డాడు. లోపలఉన్న దొంగలికి ఈ మనిషి గురికిదొరకడంతోటే కొట్టేశారు. గుండువచ్చి ఆతని తొడనుకొట్టింది. ఆతను నేలమీదపడ్డాడు.

మూలగా పొంచివున్న సబ్ ఇనస్పెక్టరు ఇది చూసి 'మల్లుదొరా! శెబాస్, మంచిపనిచేశావు. నీతమ్ముడు చంద్రయ్యని తుపాకీకి గురిచేశావు' అని కేకవేశాడు.

'ఇనస్పెక్టరుగారూ! ఎందుకు అబద్ధంఆడతారు? అబద్ధంఆడ్డం మీకు అంతసరదాగావుంటే మాతమ్ముణ్ణి ఒక్కడినే కొట్టేనని చెప్పడమెందుకు? మానాన్నని మా అమ్మునికూడా కొట్టేనని చెప్పకూడదూ?' అనే మాటలు ఇన్‌స్పెక్టరుకి జబాబుగా ఇంట్లోంచి వెలువడ్డాయి.

'నేను ఏమీ అబద్ధం ఆడ్డంలేదు. మీతుపాకిదెబ్బకు ఇప్పుడు గురిఅయింది మీతమ్ముడే. నాపిల్లలమీద ఒట్టేసుకు చెప్తున్నాను. మేము నిన్ను పట్టుకోవడంతోటే ఈవిషయం సత్యంఅనే సంగతి తెలిసిపోతుంది.' అని సబ్ ఇనస్పెక్టరు అన్నాడు.

౫

మరునిమిషంలో కిటికీలోంచి తెల్లగుడ్డ జెండా చూపెట్టారు. తోడనే తుపాకులు కాల్చడం మాని వేయమని అనుచరులకు అజ్ఞయిచ్చేను.

మల్లుదొర కిటికీ పూర్తిగా తెరిచి నన్ను ఉద్దేశించి 'సూపరెంటుదొరగారూ! మాతమ్ముడు మాతుపాకి దెబ్బకు గురిఅయింది నిజమేనా?' అన్నాడు.

'గాయపడ్డాడు. కాని ఇంకా బ్రతికేవున్నాడు.' అని నేను అన్నాను.

'మాచంద్రయ్య మీదగ్గరకు ఎల్లావచ్చేడండీ?' అని ఆతను ప్రశ్నించేడు.

నేను జబాబుఇచ్చేలోపుగానే సబ్ ఇనస్పెక్టరు అందుకుని 'మమ్మల్ని ఇక్కడికి తీసుకువచ్చింది మీ చంద్రయ్యే' అన్నాడు.

అప్పుడు మల్లుదొర నన్ను ఉద్దేశించి 'సూపరెంటు దొరా! ఇది నిజమేనా?' అన్నాడు.

నేను నిజమే అన్నాను.

'అయితే ఇదిగో ఇక మీకు లొంగిపోతున్నాను' అన్నాడు.

ఆతనిని, ఆతని అనుచరులను వారివారి ఆయుధాలను కిటికీలోనుంచి ఇవతలకు తోశేసి తలుపు తెరిచుకొని చేతులు కట్టుకుని బయటికివచ్చి నిలబడమన్నాను. వాళ్ళవల్ల ఏమాత్రం అనుమానంతగిలినా వెంటనే కాల్చేస్తామని చెప్పేను.

పదినిమిషాల్లో వాళ్లు ఆయుధాలన్నీ ఇవతలకు తోశేశారు. తలుపుతీసుకుని అయిదుగురు మనుష్యులు మడిచేతులతో బయటికివచ్చి నిలబడ్డారు.

'ఆరో 'వాడు ఏడీ?' అని అడిగేను.

ఇంక ఎవరూ లేరని మల్లుదొర చెప్పేడు.

వాళ్ళచేతులకు అరదండాలు వేయించాను. చేతులకు అరదండాలు వెయ్యడం అయినతోడనే మల్లుదొర తనకు తనతమ్ముణ్ణి చూపమని కోరాడు. ఈ లోగా అతనిదెబ్బకు కట్టుకట్టి ఓ పెడగా వుంచాను.

ఆ సోదరుల అన్యోన్యసమావేశంవంటి దృశ్యం మరోటి చూడాలని నేను జన్మజన్మేపికూడా కోరను. వాళ్లు విస్తారం మాట్లాడుకోలేదు. కాని, ఆ చూపులు—! తాను చూస్తోవున్నది తాను నమ్మలేని స్థితిలోవున్నట్లు మల్లుదొర కనిపించేడు. చంద్రయ్య స్థితి చెప్పడానికి తగినపదాలు లేవు. చచ్చిపోయిన కుర్రాణ్ణి ఒళ్ళోపెట్టుకుని ఉన్న తల్లిచూపు మీరు ఎప్పుడేనా చూచి ఉన్నారా? చంద్రయ్యచూపు ఆ తల్లిచూపుకు కొంత సన్నిహితంగా వుందని చెప్పవచ్చు. ఇంతకంటె నేను ఏమీ చెప్పలేను.

౬

మల్లుదొరమీదా, అతని అనుచరులమీదా కేసు పెట్టబడింది. మల్లుదొరమీద పూర్వపు హత్యానేరం కూడావుంది. అతని అనుచరులకు ఏడేసిఏళ్లు జయిలు శిక్ష విధించారు. మల్లుదొరకు ఉరిశిక్షపడింది. కాని అప్పీలులో ఆశిక్ష ద్వీపాంతరవాస శిక్షగా మార్చబడింది.

చంద్రయ్య ఆసుపత్రిలో గాయం మాన్పుకున్నాడు. అతనికి వేయిరూపాయిల బహుమానం ఇవ్వబడ్డది. కాని అది ఇతరబహుమానాల్లాగా, ఇతర సనదుల్లాగా కలక్టరుదర్బారులో ఇవ్వబడలేదు. తన అన్నకి అంత ద్రోహంచేసిన తమ్ముణ్ణి తాను ఏమాత్రం పొగడలేనని కలక్టరు స్పష్టంగా చెప్పేశాడు. డిపార్టుమెంటుకు ఎంత సాయంచేసినా ఇట్టి ద్రోహిని నమ్మకూడదని కలక్టరు అన్నాడు. కొన్ని సంగతులు జరక్కుండావుంటే బాగుంటాయి. అట్టివానిలో చంద్రయ్యచేసిన పని ఒకటి.

౭

చంద్రయ్యకు బహుమానం ఇవ్వబడ్డ మరుసటి దినం చిట్టిగూడెంలో ఒక స్త్రీహత్యజరిగిందనే వర్తమానం నాకు చేరింది. నేను చిట్టిగూడెం వెళ్ళేను. నేను వెళ్ళేసరికే అచటి సబ్ఇనస్పెక్టరు హంతకుణ్ణి పట్టుకుని కేసుఅంతా తయారుచేసిపెట్టేడు. హంతకుడు చంద్రయ్య; హత్యచెయ్యబడ్డ స్త్రీ అతని వదిన-మల్లుదొరభార్య - భద్రి.

విషాదగాథఅంతా బయటికివచ్చింది. భద్రికి చంద్రయ్యకీ మల్లుదొరఉండగానే ఇలాకా ఏర్పడ్డది. మల్లుదొరసంగతి పోలీసుకుచెప్పి అన్నను పట్టించి వచ్చే బహుమానంతో తన్ను పెళ్ళిచేసుకుని సుఖంగా వుండమని భద్రి చంద్రయ్యకు ఉపదేశంచేసింది. మల్లుదొరను పోలీసులు పట్టిన ఇంటికి తీసుకువచ్చింది భద్రే; మల్లుదొరసంగతి పోలీసుల్తో చెప్పమన్నదీ భద్రే.

కాని తనకుతగిలిన తుపాకిదెబ్బసంగతి తెలియడంతోటే పోలీసులకు దొరికిపోయిన మల్లుదొర సోదరప్రేమ గుర్తించి చంద్రయ్య బాగా పశ్చాత్తాపపడ్డాడు. తన కుటుంబానికి, తానుకట్టుకున్న భర్తకీ ఇంత ద్రోహంచేసిన భద్రిని చంపివేయడానికి అతను నిశ్చయించేడు. చంపేశాడు. తాను పోలీసులవశమయ్యాడు. తన పాపాలన్నీ ఉరికంబం సరిచేస్తుందనే ఆనందంతో ఉప్పొంగిపోయాడు.


ఆంధ్రజ్యోతి

మౌల్మేన్—వారపత్రిక

సాలుచందా రు 3. విడిపత్రిక 9 పైసలు.

బర్మాలోని 1,60,000 ఆంధ్రుల క్షేమానికి పాటుబడుచున్న వారపత్రిక. ఇందు కార్మిక, సాంఘిక, రాజకీయ, వాణిజ్య విషయములు నిష్పాక్షికముగ చర్చించబడును. దీనికి బర్మా అంతటను ప్రచారము గలదు. వర్తకులు ఇందు తమసరకులను ప్రకటించిన మంచి లాభమును పొందగలరు. వివరములకు :

ఎడిటర్, "ఆంధ్రజ్యోతి"

185, లోవర్ మెయిన్ రోడ్డు,

మౌల్మేన్-అని వ్రాయుడు.